సాక్షి శ్రీకాకుళం

ఆదివారం, 14, ఏప్రిల్, 2024



వేటకు విరామం

నేటి అర్ధరాత్రి నుంచి సముద్రంలో వేట నిషేధం అమల్లోకి రానుంది. జూన్ 14 వరకు ఉంటుంది.

- 8లో



రేకుల షెడ్‌పై నుంచి జారి..

రేకులషెడ్‌పై నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందారు. కొత్తూరు మండలంలో ఘటన జరిగింది.

- 8లో

కంట్రోల్ రూమ్ సందర్శన

శ్రీకాకుళం పాతబస్టాండ్: కొత్త కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. కంట్రోల్ రూంలో ఎంసీఎంసీ, సోషల్ మీడియా, డిస్ట్రిక్ట్ కాంటాక్ట్ సెంటర్ 1950, కంప్లయింట్ మానిటరింగ్ సెల్, పోలీసు కంట్రోల్ రూం, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, సీ-విజిల్ విభాగంలో ఎవరు ఏం చేస్తున్నదీ అడిగి తెలుసుకున్నారు.

సీఎంపై దాడి హేయం

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై జరిగిన దాడిని జిల్లా వైఎస్సార్ సీపీ నాయకులంతా ముక్తకంఠంతో ఖండించారు. ఇది విపక్షాల పనేనని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉన్నారని, ఇలాంటి రాజకీయాలు చేసే వారికి ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతారని అన్నారు.

కుట్రపూరితమైన చర్య



సీఎం వైఎస్ జగన్‌పై రాళ్లతో దాడి చేయడం కుట్రపూరితమైన చర్య. టీడీపీ దుండగులు చేసిన ఈ పని వారి వినాశనానికే దారి తీస్తుంది. దమ్ము, ధైర్యం ఉంటే ప్రజా క్షేత్రంలో పోరాడాలి. దీనిపై ఆమదాలవలసలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నాం.

– తమ్మినేని సీతారాం, శాసనసభాపతి, ఆంధ్రప్రదేశ్

కూటమి పనే



సీఎంపై జరిగిన దాడిని అంతా ఖండించాలి. ఇది కూటమి వారు చేసిన పనే. సీఎంకు వస్తున్న ప్రజాభిమానం చూసి ఓర్వలేకే దాడికి తెగబడ్డారు.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

ఆదరణ చూడలేకే..



సీఎం వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూడలేక టీడీపీ నాయకులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. ఎన్టీఆర్ నుంచి ముఖ్యమంత్రి కుర్చీ లాక్కున్నప్పుడు వైస్రాయ్ హోటల్‌కు వచ్చిన ఎన్టీఆర్‌పై చెప్పులు వేయించిన చంద్రబాబుకు ఇలాంటి రాజకీయాలు చేయటం కొత్త కాదు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే ఓటుతో చంద్రబాబు, పవన్‌లకు బుద్ధి చెబుతారు. – రెడ్డి శాంతి, పాతపట్నం ఎమ్మెల్యే

ప్రజలే బుద్ధి చెబుతారు



వైఎస్ జగనే మళ్లీ అధికారంలోకి వస్తారని సర్వేలన్నీ చెబుతున్నాయి. అది ఓర్వలేకే టీడీపీ నాయకులు ఇలాంటి పనులు చేస్తున్నారు. ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెబుతారు.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

ఓటమి భయంతోనే..



రానున్న ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఓటమి తప్పదు. ఆ భయంతోనే ఇలాంటి కిరాతక చర్యలకు పాల్పడుతున్నారు. ప్రజలంతా దేవుడిగా కొలుస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై రాళ్లతో దాడి చేయించి రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారు.

– దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, టెక్కలి.

ప్రజలు గమనిస్తున్నారు..



సీఎం వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ తట్టుకోలేక చంద్రబాబుతో పాటు కూటమి నాయకులంతా ఇలాంటి రాజకీయాలకు తెర తీస్తున్నారు. ఇలాంటి నీచమైన సంస్కృతి చంద్రబాబుకు తప్ప మరొకరికి ఉండదు. ప్రజలంతా గమనిస్తున్నారు.

– పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి

హేయమైన చర్య



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాయితో దాడికి పాల్పడడం హేయమైన చర్య. బస్సు యాత్రకు వస్తున్న స్పందన చూసి ఓర్వలేక ప్రతిపక్షాలే ఈ పనికి పూనుకున్నాయి.

– అంధవరపు సూరిబాబు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్

టీడీపీ మూల్యం చెల్లిస్తుంది



సీఎం వైఎస్ జగన్‌పై జరిగిన దాడికి టీడీపీ తగిన మూల్యం చెల్లిస్తుంది. ప్రజలకు మంచి చేస్తుంటే టీడీపీ పెద్దలకు నచ్చటం లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి పనులు చేస్తున్నారు.

– దుంపల లక్ష్మణరావు, కాళింగ కార్పొరేషన్ చైర్మన్

దాడి దుర్మార్గం



సీఎంపై దాడి చేయడం దుర్మార్గపు చర్య. చంద్రబాబు నీచ రాజకీయాలకు ఇది పరాకాష్ట. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

– రాపాక చిన్నారావు యాదవ్, చైర్మన్, జిల్లా గొర్రెల మేకల పెంపకదారుల సమాఖ్య, శ్రీకాకుళం

నరసన్నపేట ప్రగతి బావుటా



నరసన్నపేటలో రూ. 4.5 కోట్లతో విస్తరణకు నోచుకున్న ప్రధాన రహదారి

ఎప్పుడో 1952లో నరసన్నపేట నియోజకవర్గం ఏర్పాటైంది. 2019 వరకు ఇక్కడ అభివృద్ధి నత్తనడకనే సాగింది. కానీ ఈ ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రగతిని పరుగులు పెట్టించింది. ఈ కాలంలోనే కొమనాపల్లి వద్ద వంతెన ఏర్పాటైంది. ఈ పాలనా కాలంలోనే నరసన్నపేట రోడ్లు పెద్ద వయ్యాయి. వైఎస్ జగన్, కృష్ణదాస్ హయాంలోనే నాలుగు వేల పైచిలుకు జగనన్న ఇళ్లు నిర్మితమయ్యాయి. తాగునీటి సమస్యలు మాయమయ్యాయి. ప్రభుత్వ బడులు బాగు పడ్డాయి. నిఖార్సయిన నాయకత్వానికి నిదర్శనంలా నరసన్నపేట నిలిచింది.

- నరసన్నపేటలో అపురూపంగా అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గ ప్రజలకు రూ.1475 కోట్ల మేర లబ్ధి
- రూ.431 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు



చల్లపేట జగనన్న కాలనీ

నరసన్నపేట:

నరసన్నపేట గతంలో ఎన్నడూ చూడని రీతిలో ప్రగతి పనులకు సాక్షిగా నిలిచింది. వైఎస్ జగన్ సీఎంగా, ధర్మాన కృష్ణదాస్ ఎమ్మెల్యేగా స్థానిక సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వచ్చారు. నరసన్నపేటలో 80 అడుగుల మేర రోడ్డు వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయడంతో నరసన్నపేట పట్టణం రూపురేఖలు మారాయి. రూ.1475 కోట్లు పలు సంక్షేమ పథకాల రూపంలో లబ్ధిదారుల ఖాతాలకు జమయ్యాయి. జగనన్న కాలనీల పేరిట నియోజకవర్గ వ్యాప్తంగా ఊళ్లకు ఊళ్లు ఏర్పాటయ్యాయి.



ఉర్లాంలో జలజీవన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తదితరులు(ఫైల్)

ఇంటింటికీ నీరు, నాణ్యమైన విద్యుత్

- పోలాకి మండలంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు పిన్నింటిపేట, మబగాంల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాట్లకు రూ. 2.39 కోట్లతో పనులు చేపట్టారు.
- జలజీవన్ మిషన్ నిధులు రూ.140 కోట్లు మంజూరు కాగా రూ.61 కోట్లతో పనులు దాదాపు పూర్తి చేశారు. 38 వేల ఇళ్లకు నీటి కనెక్షన్లు ఇచ్చారు. 80కి పైగా గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నారు. నరసన్నపేట టౌన్‌లో నీటి సమస్యకు తెర దించారు.



సత్యవరంలో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాలు



నరసన్నపేటలో కాంప్లెక్స్ ఎదురుగా నిర్మించిన సీసీ రోడ్డు

అస్పత్రులకు కొత్త కళ



రూ. 1.95 కోట్లతో నిర్మించిన సారవకోట మండలం బొంతు పీహెచ్‌సీ భవనం

- నరసన్నపేటలో కమ్యూనిటీ ఆస్పత్రిని ఏరియా ఆస్పత్రిగా మార్చారు.
- గతంలో నలుగురు డాక్టర్లు ఉంటే ఇప్పుడు 21 మంది పనిచేస్తున్నారు.
- రూ. 12.50 కోట్లతో ఆస్పత్రికి నూతన భవనాలు నిర్మించారు. కొత్తగా ప్రసూతి ఆస్పత్రి కట్టారు.
- మాకివలస, ఉర్లాం, పోలాకి, గుప్పడిపేట, జలుమూరు, సైరిగాం, అచ్చుతాపురం, సారవకోటల్లో పీహెచ్‌సీలను అభివృద్ధి చేశారు.
- బొంతులో నూతనంగా పీహెచ్‌సీ మంజూరు చేస్తూ నూతన భవనం నిర్మాణం పూర్తి చేశారు.

ప్రభుత్వ భవనాలకు ఊపిరి



నరసన్నపేటలో రూ. 1.80 కోట్లతో అభివృద్ధి చేసిన ఆర్‌అండ్‌బీ అతిథి గృహం

- రూ.1.80 కోట్లతో నరసన్నపేటలో రోడ్లు భవనాల శాఖ అతిథి గృహాన్ని బాగు చేశారు.
- రూ.29 కోట్లతో 69 సచివాలయ భవనాల నిర్మాణం జరిగింది.
- రూ.11.11 కోట్లతో 51 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు.
- రూ.5.60 కోట్లతో 32 వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్‌కు భవనాలు నిర్మించారు.
- జలుమూరు తహసీల్దార్ కార్యాలయాన్ని రూ. 90 లక్షలతో అభివృద్ధి చేశారు.
- నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని రూ. 10 లక్షలతో బాగు చేశారు.

ప్రభుత్వ బడులకు మహర్దశ



ఆధునిక సౌకర్యాలతో ఈదులవలస మోడల్ స్కూల్

- పోలాకి మండలం ఈదులవలసలో మోడల్ స్కూల్‌ను బాగు చేయడానికి రూ. 1.20 కోట్లు వెచ్చించారు.
- నాడు-నేడు పథకంలో నియోజకవర్గంలో రూ.66.69 కోట్లు వెచ్చించి 195 స్కూల్స్ అభివృద్ధి చేశారు.
- నరసన్నపేట, జలుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను రూ. 2.25 కోట్లతో బాగు చేశారు. నరసన్నపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందింది.
- పోలాకి, పిన్నింటిపేట, ప్రియాగ్రహారం, మబగాంతో పాటు నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నరసన్నపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల (బోర్డు)లో రూ. 5.5 కోట్లు వెచ్చించి అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు.
- ఉర్లాం ఉన్నత పాఠశాలను ప్లస్-2గా అప్‌గ్రేడ్ చేసి మహిళా జూనియర్ కళాశాల మంజూరు చేయించి తరగతులు నిర్వహించారు.
- నరసన్నపేటలో బీసీ బాలికలు, ఎస్సీ బాలికలు వసతి గృహాలను రూ. 2 కోట్లతో అభివృద్ధి చేశారు.



ప్రగతి దారులు

- పంచాయతీ రాజ్ విభాగంలో రూ. 24 కోట్లతో 50 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మించారు.
- జాతీయ ఉపాధి హామీ పథకం, గడపగడపకూ, జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో 48 కిలోమీటర్ల పరిధిలో సీసీ డ్రైనేజీలు రూ.24 కోట్లతో ఏర్పాటు చేశారు.
- జమ్ము నుంచి నవతల వరకూ పర్లాకిమిడి రోడ్డు ఎన్‌హెచ్‌గా మారి రూ. 150 కోట్లతో అభివృద్ధికి నోచుకుంది.
- అలాగే జర్జంగి-పిండ్రువాడ రోడ్డు రూ. 36 కోట్లతో, కోమర్తి-బద్రి రూ. 25 కోట్లతో, లుకలాం-కొమనాపల్లి రోడ్డు రూ.10 కోట్లతో బాగు చేశారు.
- నరసన్నపేట టౌన్‌లో రోడ్డు విస్తరణ, సెంటర్ లైటింగ్ రూ. 4.50 కోట్లతో చేపట్టారు.
- నియోజకవర్గంలో కొవిరిపేట, బుచ్చిపేట, కామేశ్వరిపేట వీటితోపాటు మొత్తం 50 కిలోమీటర్ల మేర రోడ్లు రూ. 15 కోట్లతో అభివృద్ధికి నోచుకున్నాయి.
- పిన్నింటిపేట నుంచి అంబీరుపెంట వరకూ జెడ్పీ నిధులు రూ. 2.3 కోట్లుతో రోడ్డు వేశారు.



కోమర్తి-బద్రి ఆర్‌అండ్‌బీ రహదారి

సంతృప్తికరంగా సేవలు



నియోజకవర్గంలో అన్ని వర్గాల వారికి సంతృప్తికరంగా సేవలు అందించాం. అర్హతే ప్రామాణికంగా, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించాం. అలాగే రోడ్లు, ఆస్పత్రులు, స్కూళ్లు, కాలేజీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చాం. వందలాది మందికి సొంతిళ్లు కట్టించాం. జిల్లాలోనే మోడల్ కాలనీ జలుమూరు మండలం చల్లపేటలో నిర్మించాం. నరసన్నపేట టౌన్ అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చాం. సుమారు రూ. 20 కోట్లు వెచ్చించి వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. టీడీపీ హయాంలో భూగర్భ డ్రైనేజీ పేరిట అస్తవ్యస్తం చేస్తే.. ఆ కష్టాల నుంచి ప్రజలను బయటకు తీసుకువచ్చాం. కొమనాపల్లి వంతెన పూర్తి చేసి ఆ ప్రాంత వాసుల చిరకాల కోరిక నెరవేర్చాం.

– ధర్మాన కృష్ణదాస్, నరసన్నపేట ఎమ్మెల్యే

కొత్త చిరునామా..

- నియోజకవర్గంలో జగనన్న కాలనీలను సమర్థంగా నిర్మించారు.
- నాలుగు మండలాల్లో 102 లేఅవుట్లు వేశారు. వీటి అభివృద్ధికి రూ. 25 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది.
- వీటిల్లో 2626 ఇళ్లు నిర్మించింది.
- ఓవరాల్‌గా నియోజకవర్గంలో 6,518 ఇళ్లు మంజూరు చేయగా 4,160 ఇళ్లు పూర్తి చేశారు.
- ఇప్పటి వరకూ గృహ లబ్ధిదారులకు రూ. 52 కోట్లు ప్రభుత్వం చెల్లించింది.
- జిల్లాలోనే మోడల్ కాలనీగా జలుమూరు మండలం చల్లపేటలో జగనన్న కాలనీ నిర్మించారు.
- ఇక్కడ మౌలిక వసతుల కల్పనకు రూ.10 కోట్లు వెచ్చించారు. 125 ఇళ్లు నిర్మించారు.
- నరసన్నపేట మండలం గడ్డెయ్యపేటలో 580 ఇళ్ల నిర్మాణం జరిగింది.



గడ్డెయ్యపేట వద్ద 560 ఇళ్లతో ఏర్పాటైన జగనన్న కాలనీ

వైఎస్సార్‌సీపీ హయాంలో లబ్ధి (కొన్ని పథకాలు)

పథకం	లబ్ధిదారులు	లబ్ధి మొత్తం
జగనన్న అమ్మఒడి	23,924	రూ.101,48,47,486
జగనన్న విద్యా దీవెన	21,813	రూ.52,98,21,535
జగనన్న వసతి దీవెన	16,065	రూ.23,11,29,599
వైఎస్సార్ రైతు భరోసా	39,909	రూ.210,47,16,900
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	2,947	రూ.2,34,61,620
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	19,347	రూ.11,51,20,962
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	769	రూ.90,52,507
వైఎస్సార్ మత్స్యకార భరోసా	2452	రూ.4,67,50,000
వైఎస్సార్ పింఛన్ కానుక	44,092	రూ.377,18,63,920
వైఎస్సార్ చేయూత	23,643	రూ.87,64,81,250
వైఎస్సార్ ఆసరా	52,333	రూ.151,75,09,054
వైఎస్సార్ సున్నా వడ్డీ	54,394	రూ.6,29,06,847
వైఎస్సార్ కాపు నేస్తం	231	రూ.95,25,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	11,996	రూ.53,73,12,556
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	5,499	రూ.3,40,02,000
వైఎస్సార్ బీమా	531	రూ.7,10,79,926
వైఎస్సార్ వాహనమిత్ర	1,885	రూ.5,61,39,000
వైఎస్సార్ నేతన్న నేస్తం	103	రూ.90,67,555
వైట్‌కార్డు హోల్డర్లుకు ప్రత్యేక కోవిడ్ సహాయం	69,623	రూ.6,73,09,900
జగనన్న తోడు(వడ్డీ)	3,870	రూ.34,46,973
ఈబీసీ నేస్తం	114	రూ.35,10,000



వైఎస్సార్‌సీపీ సర్కారు హయాంలో పూర్తి చేసిన కొమనాపల్లి వంతెన

సాగరతీరంలో..

జానకి రాముల పరిణయం

- నువ్వలరేవులో వైభవంగా సీతారాముల కల్యాణం
- నేటి నుంచే శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవులో శ్రీరామనవమి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని కాపాడుకుంటూ ఇప్పటికీ అక్కడ నవమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ గ్రామంలో సామూహిక వివాహాలతో పాటు శ్రీరామ నవమి ఉత్సవాలు కూడా చాలా ప్రత్యేకం. ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.

కార్యక్రమాలు ఇవే

గ్రామంలో 10 రోజుల పాటు నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలకు అంతా సిద్ధమైంది. ఆదివారం సాయంత్రం దాసుడు ఇంటి నుంచి దేవరతో బయల్దేరి ఠకురాణి అమ్మవారికి పూజలు చేసి జెండా ఆవిష్కరణతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. పది రోజుల తర్వాత రావణ సంహారంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం శ్రీరామనవమి (17) రోజున ముందుగా గ్రామ దేవత బృందావతి అమ్మవారి ఆలయం వద్ద జెండాను ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేస్తారు. అలాగే రామాలయం వద్ద మరో జెండాను ఆవిష్కరించి హోమం, యజ్ఞాలతో పండితులు వేదమంత్రోచ్ఛరణల మధ్య సీతారాములు కల్యాణాన్ని జరిపిస్తారు. తర్వాత రోజు నుంచి 6 రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కల్యాణ క్రతువుకు దాదాపు రూ.60 లక్షల వరకు ఖర్చు చేస్తామని గ్రామస్తులు చెబుతున్నారు. వలస వెళ్లిన వారంతా వచ్చి ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు.



గ్రామ ముఖద్వారం

అంతా కలిసి..



తరతరాలుగా వస్తున్న శ్రీ రామనవమి ఉత్సవాలను ఐకమత్యంతో జరుపుకుంటున్నాం. మా ఇంటి ఇలవేల్పుగా బృందావతి అమ్మవారిని కొలుచుకుంటూ మాకు ఆదర్శ దైవంగా నిలిచిన శ్రీరాముడు, సీతమ్మలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఏటా వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నాం.

– ముమ్మల యజ్ఞా, సర్పంచ్, నువ్వలరేవు. వజ్రపుకొత్తూరు మండలం



నువ్వలరేవు గ్రామం

నియోజకవర్గాలకు ఈవీఎంల తరలింపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తయినందున వాటిని ఆయా నియోజకవర్గాలకు శనివారం తరలించారు. ఈ ప్రక్రియను కలెక్టర్ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఈవీఎంల నోడల్ అధికారి జిల్లా ఉపాధి కల్పన అధికారి సుధ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు మన ఆయుధం: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాధారణ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో శనివారం ఉదయం స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ, ఫొటో కియోస్క్ కేంద్రాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో పోలింగ్ రోజు ఓటు వేయాలన్నారు. 2019 ఎన్నికల కన్నా ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం మరింత పెరగాలని ఆకాంక్షించారు. మారుమూల గ్రామాల్లో, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం మరింత పెరగాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, డ్వామా పీడీ చిట్టి రాజు, శ్రీకాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సంతకం చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

క్లుప్తంగా

శాశ్వత అన్నదానానికి రూ. లక్ష విరాళం



సీతారామారావు ఇంటిలోనే విరాళ చెక్కును స్వీకరిస్తున్న ఈఓ చంద్రశేఖర్

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన ట్రస్ట్‌కు నగరానికి చెందిన ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ గుంటూరి సీతారామారావు, ఉషాదేవి దంపతులు శనివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. తన తల్లితండ్రులు డాక్టర్ గుంటూరి రెడ్డయ్య,సుబ్బమ్మల జ్ఞాపకార్థం ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్‌కు విరాళ చెక్కును దాతలు అందజేశారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో నివాసముంటున్న వృద్ధులైన సీతారామారావు(93) ఇంటికే నేరుగా వెళ్లి విరాళ చెక్కును ఆలయ ఈఓ చంద్రశేఖర్ స్వీకరించారు. ఆలయానికి రాలేకపోయిన దాతలను గౌరవిస్తూనే విరాళాన్ని స్వీకరించేలా చర్యలు చేపట్టేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఈఓ ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు లుకలాపు గోవిందరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ చక్రవర్తి తదితరులున్నారు.

మైక్రో అబ్జర్వర్లకు దిశానిర్దేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. సూక్ష్మ పరిశీలకులకు అంబేడ్కర్ ఆడిటోరియంలో అవగాహన, శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ విధానాన్ని పరిశీలిస్తూ ఎలాంటి తప్పిదాలు, ఉల్లంఘనలు జరిగినా రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పోలింగ్‌కు గంట ముందు మాక్ పోలింగ్ నిర్వహించాలని, పోలింగ్ స్టేషన్లు పరిశీలించాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రవేశపెట్టిన హోం ఓటింగ్‌ను వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఏప్రిల్ 18 నుంచి 23 వరకు ఇందుకు సంబంధించిన ఫారం–12డి దరఖాస్తులను సంబంధిత సిబ్బంది సేకరిస్తారని, దాని ఆధారంగా పోస్టల్ బ్యాలెట్ మాదిరిగా హోం ఓటింగ్ అవకాశాన్ని కల్పించాలన్నారు. ఈ హోం ఓటింగ్ ఎలా నిర్వహించాలో అవగాహన కల్పించారు.

'భద్రాచలం ప్రత్యేక బస్సు సద్వినియోగం చేసుకోండి'



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీరామనవమి సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ భద్రాచలంకు ప్రత్యేక బస్సు వేసిందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ పి.మల్లికార్జునరాజు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయ ఆవరణలో శనివారం భద్రాచలం ప్రత్యేక బస్సుల బ్యానర్‌ను ఆర్టీసీ ఒకటో డిపో మేనేజర్ మల్లికార్జునరాజు, ఆర్టీసీ అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరాజు మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి భద్రాచలంకు మొట్టమొదటిసారిగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని తెలిపారు. ప్రయాణ చార్జీ సాధారణ చార్జీలేనని, పెద్దలకు ఒక్కొక్కరికి రూ.940, చిన్నారులకు రూ.570గా నిర్ణయించారు. ప్రయాణికులు తమ టికెట్‌లను ముందుగానే రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. భద్రాచలంనకు వెళ్లే భక్తులు తమ టికెట్‌లు, ఇతర వివరాలకు 7382921647, 7382919694 నంబర్లకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రేకుల షెడ్‌పై నుంచి జారిపడి వ్యక్తి మృతి

కొత్తూరు: మామిడి పండ్ల కోసం రేకుల షెడ్ ఎక్కిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. కొత్తూరు మండలంలోని గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీ వద్ద శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాలు ప్రకారం.. మండలంలోని గూనభద్ర అపోజిట్ ఆర్‌ఆర్ కాలనీకి చెందిన మీసాల మిన్నారావు(35) మామిడి పండ్ల కోసం గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీలోని విశాఖ పాలకేంద్రానికి ఎదురుగా ఉన్న అలికాం బత్తిలి రోడ్డుకు ఆనుకొని ఉన్న మామిడి చెట్టు వద్దకు శనివారం వేకువజామున చేరుకున్నాడు. మామిడి చెట్టు కిందన ఉన్న రేకులు షెడ్‌పైన కొన్ని పండ్లు పడి ఉండగా.. వాటిని తీసేందుకు మిన్నారావు రేకుల షెడ్ ఎక్కాడు. అయి తే షెడ్‌పై నుంచి అమాంతం జారిపడడంతో మృతి చెందాడు. స్థానికులు మిన్నారావు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేయడంతో భార్య రమ్యతో పాటు కుటుంబ సభ్యులు సంఘటన స్థలం వద్దకు చేరుకున్నారు. మిన్నారావుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈయన తాపీ పని పనిచేసుకుంటూ బతుకుతున్నారు. మిన్నారావు మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. భార్య రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ బి.కోటేశ్వరరావు తెలిపారు. సీఐ ఆర్.వేణుగోపాలరావు సంఘటన స్థలం వద్దకు చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.



కవిటి: నెలవంకలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిరియా విజయ ఎన్నికల ప్రచారం



పాతపట్నం: సీదిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కాశీబుగ్గ: మందస మండలం బహాదపల్లి పంచాయతీ ప్రచారంలో డాక్టర్ సీదిరి అప్పలరాజు

అలుపెరుగని రీతిలో..

ఎన్నికల ప్రచారం అలుపెరుగని రీతిలో జరుగుతోంది. ఆత్మీయ పలకరింపులతో నాయకులు జోరుగా ఊరూరా తిరుగుతున్నారు.



జలుమూరు: మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్



సంతబొమ్మాళి: వృద్ధురాలితో ఆత్మీయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



రణస్థలం: కొండములగాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్

వేటకు విరామం

- నేటి అర్ధరాత్రి నుంచి జూన్ 14 వరకు చేపల వేట నిషేధం
- ఐదేళ్లుగా మత్స్యకారులకు అండగా వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం
- రూ. 10 వేలు చొప్పున భృతిగా రూ.70.61 కోట్లు పంపిణీ చేసిన జగన్ సర్కార్



అరసవల్లి: చేపల సంతానోత్పత్తి సమయం వచ్చేసింది. ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి (తెల్లారితే 15వ తేది) నుంచి జూన్ 14వ తేదీ వరకు మొత్తంగా 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేట నిషేధ సమయంగా ప్రభుత్వం ప్రకటించింది. ఏటా ఇదే షెడ్యూల్‌లో వేటను నిషేధించి తద్వారా మత్స్య సంపదను పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీర ప్రాంత మత్స్యకారులకు పలు రకాల ఆంక్షలు విధిస్తుంటాయి. ప్రాదేశిక సముద్ర జలాల్లో యాంత్రిక పడవలు, మెకనైజ్డ్, మోటారు బోట్ల ద్వారా చేపల వేటను నిషేధిస్తూ రాష్ట్ర మత్స్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. చేపల సంతతిని పెంచి, మత్స్యకారులకు ప్రయోజనం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న వేట విరామం ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానుంది. సుమారు రెండు నెలల పాటు ఈ నిషేధ సమయం అమల్లో ఉండడంతో సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా మత్స్యశాఖ, కోస్టల్ గార్డ్స్, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, నేవీ అధికారులతో గస్తీ ఏర్పాటు చేస్తున్నారు. ఈ వేట నిషేధ కాలంలో జిల్లాలో తీర ప్రాంత మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరిట రూ.10 వేలు చొప్పున పరిహారాన్ని గత ఐదేళ్లుగా అందజేస్తోంది. ఇదే జీవన భృతిని చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కేవలం రూ.4 వేలు మాత్రమే అందించేవారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో శ్రీకాకుళం, గార, నరసన్నపేట, పోలాకి, సంతబొమ్మాళి, పలాస, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం తదితర 11 మండలాల్లో మొత్తం 60 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఉండగా, వేటకు వినియోగించే మోటరైజ్డ్ బోట్లు –1530, నాన్ మోటరైజ్డ్ బోట్లు (సంప్రదాయ పడవలు) –2652, మొత్తంగా 4182 బోట్లు ఉన్నట్లుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే నిబంధనల ప్రకారం మోటరైజ్డ్ బోటుకు ఆరుగురు చొప్పున, నాన్ మోటరైజ్డ్ బోటుకు ముగ్గురు చొప్పున మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో ప్రభుత్వం తరఫున ఇంతవరకు రూ.10 వేలు చొప్పున భృతి అందింది. తాజాగా వేట నిషేధ సమయంలో జీవనాన్ని కోల్పోయిన వారి జాబితా ఎన్యుమరేషన్‌ను కూడా మరో నాలుగైదు రోజుల్లో మత్స్యశాఖాధికారులు నేరుగా ఆయా తీరప్రాంతాల్లోకి వెళ్లి తుది జాబితాలను తయారుచేయనున్నారు.

నిబంధనలు అతిక్రమించకూడదు..

అయితే వేట నిషేధ సమయంలో విధిస్తున్న నిబంధనలు అతిక్రమించిన మత్స్యకారులకు ఏపీ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం 1995, సెక్షన్ 4 ప్రకారం శిక్ష తప్పదు. అతిక్రమించిన బోట్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానా విధింపుతో పాటు ప్రభుత్వం తరఫున ఇస్తున్న అన్ని రాయితీలను రద్దు చేస్తామని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు ఆదేశాలు జారీ చేశారు.

సర్కారు సాయం రూ.70.61 కోట్లు

డాక్టర్ వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద 2019 నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.10 వేల చొప్పున జీవన భృతిగా అందజేసింది. అలాగే రాయితీపై డీజిల్‌ను కూడా అందజేసింది. ఈ లెక్కన మొత్తం ఐదేళ్లలో మొత్తం 70,611 మందికి రూ.70.61 కోట్లను భృతి కింద నేరుగా వారి ఖాతాల్లోకి జమచేసింది.

తప్పిన ముప్పు

నందిగాం: మండలంలోని పెద్దబాణాపురం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కారు బోల్తా పడిన సమయంలో కారులో ముగ్గురు ప్రయాణిస్తున్నారని, కానీ వారికి ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.



పెద్దబాణాపురం సమీపంలో బోల్తాపడిన కారు

కేఆర్ స్టేడియం పనులు పూర్తి చేస్తాం



వాకర్స్‌తో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం పనులు పూర్తి చేస్తామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన నగరంలో కోడిరామ్మూర్తి స్టేడియం, ఆర్ట్స్ కాలేజీలో వాకర్స్‌తో కలిసి శనివారం మాట్లాడారు. కోడి రామ్మూర్తి స్టేడియాన్ని కూలగొట్టింది టీడీపీ ప్రభుత్వమేనని, వారు అధికారంలో ఉండగా ఏం చేశారని ప్రశ్నించారు. శ్రీకాకుళం ఆమదాలవలస రోడ్డుకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ద్వారా రూ.40 కోట్లు తెప్పించానని, ఇందుకు చీఫ్ ఇంజినీర్ రామచంద్రరావు ఎంతగానో సహకరించారన్నారు. ఇప్పటివరకు రూ.14కోట్లు మేర పనులు పూర్తిచేశారని, పేమెంట్ ఇవ్వడానికి ఔట్ ఆఫ్ టర్న్ ఇవ్వాల్సి వస్తుందన్నారు. దీనిపై విపక్ష నేతలు పిటీషన్ పెట్టారని అందుకే పనులు నిలిచిపోయారన్నారు. ఇష్టం వచ్చినట్లు బిల్లులు ఇచ్చేస్తున్నారని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది టీడీపీ నేతలేనని, దీంతో పనులు నిలిచిపోయాయని, ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీపైకి నెట్టేస్తున్నారని వివరించారు.

ఏపీలో మూలపేట పోర్టుతో పాటు మరో 3 సీ పోర్టులకు నిర్మాణాలు జరుగుతున్నాయని, దాదాపుగా అవన్నీ పూర్తి కావచ్చాయన్నారు. ఉద్దాన ప్రాంత కిడ్నీ రోగుల సమస్యను పరిష్కరించింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. జిల్లాకు చంద్రబాబు ఏనాడూ మంచి చేయలేదన్నారు. రిమ్స్‌ను 900 బెడ్స్‌గా అభివృద్ధి చేశామన్నారు. అధికారులంతా ఒకే చోట ఉంటూ పనిచేసే విధంగా సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణం చేపట్టామన్నారు. జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు, కూన రవి కుమార్‌లు విశాఖ కేంద్రంగా రాజధాని ఏర్పాటుకు సంబంధించి తమ స్టాండ్ ఏంటో చెప్పగలరా అని ప్రశ్నించారు. మీరు ఇవన్నీ గుర్తించి మీ అందరికీ మేలు చేసే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని కోరారు. సమావేశంలో గేదెల ఇందిరాప్రసాద్, శాసపు జోగినాయుడు, సిజు, ఎండ రమేష్, బిర్లంగి రామ్మోహన్‌లతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, వాకర్స్, అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి



వైఎస్సార్‌సీపీలో చేరిన కుటుంబాలతో స్పీకర్ తమ్మినేని సీతారాం, తదితరులు



ధర్మాన ప్రసాదరావు సమక్షంలో పార్టీలోకి చేరిన పీఎన్ కాలనీ వాసులు

పొందూరు: పొందూరు పట్టణంలో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. స్పీకర్ తమ్మినేని సీతారాం సమక్షంలో టీడీపీకి చెందిన 60 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారందరికీ నియోజకవర్గం పరిశీలకురాలు ఎంవీ పద్మావతి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు(రామారావు), సరుబుజ్జిలి ఎంపీపీ కిల్లి సత్యన్నారాయణ, మండల పార్టీ కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, సర్పంచ్ రేగిడి లక్ష్మి, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, పీఏసీఎస్ కొంచాడ రమణమూర్తి, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు జైప్రతాప్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్, నాయకులు కిల్లాన సూర్యారావు, కాకర్ల రాజారావు, లోలుగు శ్రీరాములనాయుడు, బాడాన వెంకటక్రిష్టారావు, గుడ్ల మోహన్, అనకాపల్లి సత్తిబాబు, అనకాపల్లి గోవింద తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో..

శ్రీకాకుళం రూరల్: పీఎన్ కాలనీకి చెందిన 150 కుటుంబాలు వ్యాపార వేత్త సీపాన మహేంద్ర ఆధ్వర్యంలో శనివారం పెదపాడులోని ధర్మాన క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరికి మంత్రి ధర్మాన ప్రసాదరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోణార్క్ శ్రీను, చౌదరి సతీష్, అందవరపు సంతోష్, బరాటం సంతోష్, సీపాన రామారావు, తోట తారక్, గుంట జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి బుడంబో టీడీపీ నాయకులు

కాశీబుగ్గ: మందస మండలం బుడంబో గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బుడంబో గ్రామానికి చెందిన వార్డు మెంబర్ భాస్కరరావు, బాలరాజు, జగదీష్, మోహన్, రాజారావు, మహేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యారాము, క్లస్టర్ ఇన్‌చార్జ్ సవర డొంబురు, జిల్లా గిరిజన సంఘ జాయింట్ సెక్రటరీ సవర నందు పాల్గొన్నారు.

జలుమూరులో..

జలుమూరు: నగిరికటకం, దోమనాపల్లి గ్రామాలకు చెందిన 65 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి శనివారం చేరాయి. వీరికి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బగ్గు వెంకటరావు, బైరి బాబ్జి, జనార్దనరావు, సంజీవరావు, నేతింటి కృష్ణ, మూకళ్ల జోగులు తోపాటు పలువురు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి,మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, పంచిరెడ్డి రాజారావు, లింగమూర్తి, బీవీ రమణ ఉన్నారు.



బుడంబో గ్రామం నుంచి పార్టీలో చేరిన వారితో డాక్టర్ సీదిరి అప్పలరాజు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ధర్మాన కృష్ణదాస్

వైఎస్సార్‌సీపీలోకి రణస్థలం మాజీ ఎంపీపీ

రణస్థలం: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో రణస్థలం మాజీ ఎంపీపీ గొర్లె విజయకుమార్, రణస్థలం మండల టీడీపీ ఉపాధ్యక్షుడు దుర్గాసి రామారావులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరు విశాఖలోని వైవీ సుబ్బారెడ్డి కార్యాలయంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తమ నియోజకవర్గంలో కూటమి తరఫున కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం బీసీలను అవమానించడమేనని వారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం, ఎచ్చెర్ల ఏఎంసీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, మరువాడ సర్పంచ్ జక్కంపూడి అచ్చిబాబు, ఎంపీటీసీ ఉప్పాడ అప్పన్న, నాయకులు పిల్ల తాత, జక్కంపూడి బంగార్రాజు తదితరులు ఉన్నారు.



గొర్లె విజయకుమార్, రామారావులను ఆహ్వానిస్తున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్